క్లుప్తంగా

ప్రసన్నాంజనేయస్వామికి అరటిపండ్ల పూజ



అద్దంకి రూరల్: మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన శింగరకొండ దేవస్థానంలో అమావాస్య సందర్భంగా ఆదివారం ప్రసన్నాంజనేయస్వామికి 10 వేల అరటిపండ్లతో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా 11 ఆవృత్తాలుగా పూజ నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన సహాయ కార్యనిర్వహణాధికారి టి సుభద్ర, దేవస్థాన అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తు

బల్లికురవ: బల్లికురవలోని కస్తూరిబా గాంధీ గురుకుల బాలికల విద్యాలయంలో ఆరో తరగతి, ఇంటర్మీయేట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కోనా సరళకుమారి ఆదివారం తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి బడిబయట చిన్నారులు, అనాథలు, పేద, ఎస్సీ,ఎస్టీ బీసీ, మైనార్టీ బాలికలు మాత్రమే అర్హులు అన్నారు. ఈనెల 12వ తేదినుంచి ఏప్రిల్ 11వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కొప్పరపాడులో రేపు జేఏఎస్ క్యాంపు

బల్లికురవ: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత క్యాంపు మంగళవారం మండలంలోని కొప్పరపాడు గ్రామంలో నిర్వహిస్తున్నట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ సోమవారం తెలిపారు. మొదటి విడతలో చూపించుకున్న రోగులు కేస్‌షీట్లు రిపోర్టులతో పాటు కొత్త రోగులు శిబిరానికి హాజరై వివిధ రకాల పరీక్షలతో వైద్యం చేయించుకొవచ్చన్నారు. శిబిరానికి తనతో పాటు కార్పొరేట్ వైద్యులు కూడా హాజరవుతారని సద్వినియోగ పరుచుకోవాలన్నారు.

నగదు ఇవ్వమని అడిగినందుకు వ్యక్తిపై దాడి

చినగంజాం: అప్పు తీసుకున్న నగదు ఇవ్వమని అడిగితే కొట్టి పంపారంటూ ఓ వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని గొనసపూడికి గ్రామానికి చెందిన కందిమళ్ల వేణుబాబు సోపిరాల గ్రామానికి చెందిన పోలకం శరభయ్యకు రెండేళ్ల క్రితం రూ.6 లక్షలు విలువ చేసే రొయ్యల మేత, మరో రూ.10 లక్షలు నగదు అప్పుగా ఇచ్చాడు. గత రెండేళ్లుగా తన అప్పు కోసం శరభయ్యను కలిసేందుకు తిరుగుతున్నాడు. ఈ నెల 7వతేదీ శరభయ్య ఊరిలోకి వచ్చిన విషయం తెలుసుకొని డబ్బులు అడిగేందుకు వెళ్లాడు. ఆ సమయంలో వేణుబాబును శరభయ్య అతని అనుచరులు మరో ముగ్గురు దుర్భాషలాడి దాడిచేశారు. గాయాల పాలైన అతను ఆస్పత్రిలో వైద్యచికిత్స నిమిత్తం చేరాడు. అనంతరం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాది వేణుబాబు ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ పెర్నేటి ప్రకాశరావు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ, ఇద్దరికి తీవ్ర గాయాలు



అంబులెన్స్‌లో ఉన్న క్షతగాత్రులు

జే.పంగులూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొని బీహార్ వాసులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన మండల పరిధిలోని రేణింగవరం పోలీసు స్టేషన్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. రేణింగవరం నుంచి జాగర్లమూడివారిపాలెం వైపు బైక్‌పై వెళ్తున్న బీహార్ వాసులను గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈప్రమాదంలో ఒక వ్యక్తి తలకు బలమైన గాయంకాగా, మరో వ్యక్తికి కాలు విరిగింది. క్షతగాత్రులను 108 ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న రేణింగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10వ తరగతి విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

కురిచేడు: బహుజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మెటీరియల్ ఆదివారం పంపిణీ చేశారు. సంఘం గౌరవ ప్రతినిధి, ముండ్లమూరు పంచాయతీ రాజ్ ఇంజినీరు మొగిలి వెంకటేశ్వర్లు ఆర్థిక సహకారంతో మెటీరియల్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ కె.. అహరోన్, భద్రీనాథ్‌ల చేతుల మీదుగా అందజేసినట్లు సంఘం నియోజకవర్గ ప్రతినిధి అట్లూరి రామారావు తెలిపారు. గత 20 సంవత్సరాల నుంచి అంబేడ్కర్ ఆశయాల మేరకు పేద విద్యార్థుల సంక్షేమం కోసం పనిచేస్తున్నామన్నారు.

సంద్రంలా మారిన సిద్ధం



జాగర్లమూడిలో సిద్ధం సభకు తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



చినగంజాం నుంచి సిద్ధం సభకు తరలి వెళ్తున్న కార్యకర్తలు, నాయకులు



సూరవరపుపల్లిలో సభకు తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

- సిద్ధం సభతో వైఎస్సార్ సీపీలో జోష్
- కేడర్‌లో నూతనోత్సాహం
- జై జగన్.. అంటూ భారీగా హాజరైన జనం
- టీడీపీ నాయకుల గుండెల్లో రైళ్లు

అద్దంకి: దేశ రాజకీయ చరిత్రలో వైఎస్సార్ సీపీ కనీవిని ఎరుగని స్థానం సంపాదించింది. ఏ రాజకీయ పార్టీకి రాని జనం వైఎస్సార్ సీపీకి లక్షలాది మంది తరలి వచ్చారు. దీంతో కొరిశపాడు మండలంలోని పీ గుడిపాడు వద్ద ఆదివారం నిర్వహించిన సిద్ధం సభ మొత్తం జన సంద్రంతో కిక్కిరిసిపోయింది. ఎటు చూసినా జనమే.. ఎక్కడ చూసినా నాయకులు, కార్యకర్తలే. ఎవ్వరు మాట్లాడినా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన గురించే అంటే అతిశయోక్తి కాదు. ఈ ముగింపు సభతో వైఎస్సార్ సీపీ కేడర్‌లో జోష్ వచ్చింది. సీఎం జగన్ ప్రసంగం మరింత ఉత్సాహాన్ని నింపింది. లక్షలాదిగా సిద్ధం సభకు వచ్చిన జన సందోహాన్ని చూసి టీడీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి.

సిద్ధం సభకు నియోజకవర్గం నుంచి ప్రజలు వేలాదిగా భారీగా హాజరయ్యారు. ఉదయం ఏడు గంటల నుంచే అభిమానులు జెండాలను ద్విచక్ర వాహనాలకు కుట్టుకుని జై జగన్.. అంటూ తరలి వెళ్లారు. మహిళలు, వృద్ధులు సైతం ఎండను లెక్క జేయకుండా సభకు తరలి వెళ్లారు.

హనిమిరెడ్డి గెలుపు ఖాయం..

సిద్ధం సభకు అద్దంకిలో నిర్వహించడంతో గతంలోనే టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి వచ్చిన నాయకుల జోష్‌కు సిద్ధం సభలో సీఎం జగన్ ప్రసంగం నాయకులు, కార్యకర్తల్లో ఊపు ఉత్సాహాన్ని ఇచ్చింది. దీంతో అద్దంకిలో సమన్వయకర్త హనిమిరెడ్డి ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని తేలిపోయింది.

స్వచ్ఛందంగా సిద్ధం సభకు వెళ్లిన జనం..

యద్దనపూడి/కారంచేడు: వైఎస్సార్ సీపీ నిర్వహించిన చివరి సిద్ధం సభకు పార్టీ శ్రేణులు జనం ఉవ్వెత్తున్న తరలి వెళ్లారు. అద్దంకి నియోజకవర్గం కొరిశపాడు మండలం మేదరమెట్ల వద్ద సిద్ధం సభ నిర్వహించారు. ఆదివారం ఈబహిరంగ సభకు మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు గ్రామాల నుంచి ఉత్సాహంతో ఉరకలేస్తూ ఉపొంగిన నిండుమనసుతో అక్కచెల్లెమ్మలు , అన్నతమ్ముళ్లు, పథకాల లబ్ధిదారులు నాయకులు, కార్యకర్తలతో కలిసి సభాస్థలికి బయలుదేరి వెళ్లారు. సంక్షేమసారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూడాలన్న ఆకాంక్షతో వారంతా కనివిని ఎరుగని రీతిలో వేలాదిగా సభకు చేరారు. ఆయా గ్రామాల పంచాయతీ సర్పంచ్‌లు ,ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సిద్ధం సభకు వాహనాల్లో వెళ్లారు.



మార్టూరు నాయకులతో నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ

➤ కారంచేడు మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో వేలాది మంది నాయకులు, కార్యకర్తలు వెళ్ళారు. ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీశ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, మాజీ వైస్ ఎంపీపీ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ యార్లగడ్డ శ్రీకాంత్‌బాబు, మండల పార్టీ కన్వీనర్ దండా చౌదరిబాబు, మండల కోఆప్షన్ మెంబర్ ముల్లా నూర్ అహ్మద్, అన్ని గ్రామాలకు చెందిన నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

టీడీపీ పట్టున్న గ్రామాల్లో సైతం తరలి వెళ్లిన ప్రజలు..

చీరాల: ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ పిలుపు మేరకు ప్రతి పల్లె, ప్రతి వార్డు నుంచి సిద్ధం సభకు మైము సైతం అంటూ తరలి వెల్లడం విశేషం . ముఖ్యంగా తెలుగుదేశం పార్టీకి పట్టు ఉన్న చీరాల రూరల్ గ్రామాలు, వేటపాలెం మండలం సముద్ర తీర ప్రాంతాలైన పట్టపు గ్రామాల నుంచి సిద్ధం సభకు బస్సుల్లో, కార్లల్లో వేలాదిగా తరలి వెళ్లారు. కార్యకర్తలకు వెంకటేష్ భోజనం, మంచినీరు, వసతి సౌకర్యాలుఏర్పాటు చేశారు. సభకు తరలి వెళ్లని వారిలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైఎస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివసరావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లి వైష్ణవి, మున్సిపల్ కౌన్సిర్స్ మించాల సాంబ శివరావు, బత్తుల అనిల్, కంపా అరుణ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు కోద్రు బాబ్జి, రూరల్ పార్టీ అధ్యక్షుడు అసోది అంకాల రెడ్డి, వేటపాలెం మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, జేసీఎస్ ఇన్‌చార్జి, మాజీ సర్పంచ్ లేళ్ల శ్రీధర్, ఆర్‌బీకే చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు సీతామ హాలక్ష్మీ, జిడు మస్తాన్ ఉన్నారు.



చీరాల నుంచి సభకు తరలి వెళ్తున్న కార్యకర్తలు



పర్చూరులో బైక్ ర్యాలీగా వెళ్తున్న నాయకులు



పర్చూరు నుంచి బస్సులో తరలి వెళ్తున్న కార్యకర్తలు

పర్చూరు (చినగంజాం): మేదరమెట్లలో నిర్వహించిన సిద్ధం సభకు పర్చూరు నియోజకవర్గం నుంచి సమన్వయకర్త యడం బాలాజీ ఆధ్వర్యంలో భారీగా వివిధ వాహనాలలో కార్యకర్తలు, ప్రజలు లక్షలాది మంది సభకు బయలుదేరి వెళ్లారు. ముఖ్యంగా ఇంకొల్లు మండలం నుంచి ద్విచక్రవాహనాలపై సుమారు 1000 మంది ర్యాలీగా ప్రాంగణానికి తరలి వెళ్లడం విశేషం.

బల్లికురవ: మండల పార్టీ మండల ఇన్‌చార్జి డీ. బ్రహ్మారెడ్డి, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, జెడ్పీటీసీ అంజలి శ్రీనివాస్, పార్టీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లి అంజనీ ప్రసాదరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ముద్దపాటి శంకర్, బల్లికురవ, వల్లాపల్లి, కెరాజు పాలెం సొసైటీల అధ్యక్షుడు గుర్రం రంగారావు, మంచాల శ్రీనివాసరెడ్డి, ఒంగోలు సుబ్బారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీల ఆధ్వర్యంలో గ్రామాల వారీగా స్త్రీ, పురుషులు సిద్ధం సభకు కోలాహలంగా వెళ్లారు.



కారంచేడు నుంచి జెడ్పీటీసీ ఆధ్వర్యంలో బయలుదేరుతున్న పార్టీ కార్యకర్తలు



చీరాల రూరల్ ప్రాంతం నుంచి సభకు తరలుతున్న పార్టీ శ్రేణులు



మల్లాపాలెం నుంచి బయలుదేరిన బస్సులు

వైభవోపేతంగా మహాశివుని రథోత్సవం

దర్శి: దర్శి పట్టణంలోని శ్రీ కాశీఅన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా జరుగుతున్న వేడుకల్లో భాగంగా ఆదివారం స్వామి వారి రథోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలు రథంలో అలంకరించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారి రథాన్ని లాగి శివనామస్మరణ చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ...రథోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.



రథం లాగుతున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్ రెడ్డి



త్రిపురాంతకం శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి

వైభవంగా రథోత్సవం

త్రిపురాంతకం: మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తజనుల హరనామస్మరణతో ఈప్రాంతమంతా మారుమోగింది. త్రిపురాంతకంలో మహాశివరాత్రి మహోత్సవాలు 6వ తేదీ నుంచి జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం మహాశివరాత్రి జాగారం రాత్రి స్వామి అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం జరిగింది. అనంతరం పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వార్ల రథోత్సవం వేలాదిమంది భక్తజనులు ముందుంచి నడిపించగా వైభవంగా జరిగింది. ఆలయాల ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ఐవీ సుబ్బారావు సభ్యులు, రథోత్సవం ఈఓ చెన్నకేశవరెడ్డి, తహసీల్దార్ రామకృష్ణ శివప్రసాదర్, డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సీఐ సుబ్బారావు, ఎస్ఐ సాంబశివయ్య బందోబస్తు నిర్వహించారు.



త్రిపురాంతకం శ్రీపార్వతి త్రిపురాంతకేశ్వరస్వామి రథోత్సవం

నూర్‌బాషా సంక్షేమ సంఘ మండలాధ్యక్షునిగా పీరయ్య

కొమరోలు: రాష్ట్ర నూర్‌బాషా/దూదేకుల బీసీ ముస్లిం సంక్షేమ సంఘం మండలాధ్యక్షునిగా అంబవరపు పీరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు షేక్ మీరావలి తెలిపారు. జాయింట్ సెక్రటరీగా భీమునిపాటి పీరయ్య, కోశాధికారిగా ఎం.చెంచయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు.

అబాకస్‌లో సత్తా చాటిన స్పందన విద్యార్థులు

రాచర్ల: అబాకస్, వేదిక్ మాథ్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో స్పందన స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన అబాకస్, వేదిక్ మాథ్స్ రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షల్లో రాచర్ల స్పందన స్కూల్ విద్యాసంస్థల విద్యార్థులైన షేక్ నజీర్ బాష అబాకస్ జూనియర్ లెవెల్–1లో మొదటి స్థానం సాధించగా, షేక్ సమీర్ వేదిక్ మ్యాథ్స్ లెవెన్–2లో ద్వితీయ స్థానాన్ని సాధించినట్లుగా స్పందన స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్‌కుమార్ రెడ్డి తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ మేమెంటో, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ విజయానికి కారణమైన పాఠశాల ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఈవీఎంలపై అవగాహన

పుల్లలచెరువు: ప్రతి ఓటరు ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలని సెక్టార్ అధికారి ఇందిరాప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక బీసీ కాలనీలో ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఇందిరాప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటు ఎలా వేయాలి, తమ వేసిన ఓటు గుర్తు వీవీ ప్యాడ్స్ ద్వారా నిర్ధారించుకోవాలని తెలిపారు. వీఆర్వో వెంకట సుబ్బయ్య, సిబ్బంది సరోజ్‌బాబు, బ్రహ్మయ్య, తులసీబాయ్, నాయకులు జానికిరఘు, లక్ష్మీనారాయణ, గురునాథం పాల్గొన్నారు.

గాయత్రి యజ్ఞంతో దేవతలు సంతోషిస్తారు



యజ్ఞం నిర్వహిస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: గాయత్రి యజ్ఞం నిర్వహించడం వల్ల సకల దేవతలు సంతోషిస్తారని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణ రెడ్డి అన్నారు. అమావాస్య సందర్భంగా గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో పట్టణంలోని గాయత్రిమాత ఆలయంలో ఆదివారం నిర్వహించిన యజ్ఞంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యజ్ఞం వల్ల సకల శుభాలు సంతరించుకుంటాయన్నారు. మనలోని రుగ్మతలు తొలగి మంచి ఆలోచనల వైపు అడుగులు వేసేందుకు ఇటువంటి దైవీయ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. గాయత్రి పరివార్ సభ్యులు వీరారెడ్డి, నారాయణరెడ్డి, డాక్టర్ శివారెడ్డి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని తుదముట్టించాలి



రజాక్‌ను సన్మానిస్తున్న ఎంపీజే నాయకులు

మార్కాపురం టౌన్: ప్రజలను చైతన్యపరిచి, దేశంలో పేట్రేగుతున్న మతోన్మాదాన్ని తుదముట్టించాల్సిన అవసరం ఉందని ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు షేక్.అబ్దుల్ రజాక్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఎంపీజే జిల్లా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రజాక్ మాట్లాడుతూ.. దేశంలో రోజురోజుకూ మతోన్మాదం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. శాంతి, సామరస్యాన్ని వెల్లివిరిసేలా చూడటంతోపాటు మాదక ద్రవ్యాల నుంచి ప్రజలను విముక్తులను చేయాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. న్యాయవ్యవస్థ గౌరవాన్ని పెంచాలని, వైద్యం, రేషన్ మాఫియాపై పోరాటం చేయాలన్నారు. ఎంపీజే కార్యకర్తలు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ స్వచ్ఛంద సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రసూల్, ఖాశింఖాన్, అమీర్, అయూబ్‌ఖాన్, ఖాశింపీరా, మీరావలి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రజాక్‌ను సన్మానించారు.

నూతన భవనాలకు ఎమ్మెల్యే అన్నా శంకుస్థాపన



ఎమ్మెల్యే అన్నా రాంబాబును సన్మానిస్తున్న ముస్లింలు

పొదిలి రూరల్: మండలంలోని కాటూరివారిపాలెం సమీపంలో రఫీ మౌలానా ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న మసీద్, మదర్సా, ఉచిత హాస్పిటల్ భవనాలకు ఆదివారం వైఎస్సార్ సీపీ మార్కాపురం సమన్వయకర్త, ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు శంకుస్థాపన చేశారు. ఖురాన్ కంఠస్థం పూర్తి చేసిన 40 మంది విద్యుర్థులను ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సామాజికవర్గ విద్యార్థులకు, పేదలకు ఉపయోగపడేలా మంచి పని చేస్తున్న రఫీ మౌలానా, కమిటీ సభ్యులను అభినందనీయులన్నారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువకప్పి సన్మానించారు. ఆయన వెంట మార్కాపురం ఏఎంసీ చైర్మన్ షంషీర్ అలీబేగ్, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గుజ్జుల సంజీవరెడ్డి, రబ్బానీ, ఫిరోజ్, ఆక్స్‌ఫర్డ్ అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.